జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | 6 | మే | 2026 ◆ పేజీలు : 6

## విద్యార్థులు శ్రద్ధతో నేర్చుకొని విజయం సాధించాలి

- భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్



**భద్రాచలం టౌన్, మే 5, ప్రజాజ్యోతి** ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డ్యాన్స్, పాటలు, కంప్యూటర్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు తగిన శ్రద్ధతో శిక్షణ పొంది విజయం సాధించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాల్ అన్నారు. మంగళవారం భద్రాచలం లోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల పాఠశాల, వికాసం పాఠశాలలో జరుగుతున్న సమ్మర్ క్యాంపు వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులు నేర్చుకుంటున్న ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డాన్స్, పాటలు, కంప్యూటర్ శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా

మిగతా 2 లో...






- పాల్వంచ మున్సిపల్ కార్యాలయంలోని చెత్త ట్రాక్టర్ల నుండి డీజిల్ చోరీ
- నాడు బ్యాటరీల చోరీ__ నేడు డీజిల్ చోరీ
- అసలు దొంగ ఎవరు?
- వాహనాలు పార్కింగ్ చేస్తున్న ఏరియాలో కనపడని సీసీ కెమెరాలు
- వాచ్మెన్ ఉన్న లేనట్టేనా?
- డీజిల్ మాయమైన పోలీసులకు ఫిర్యాదు చేయని అధికారులు
- నెల రోజులుగా ప్రజలకు అందుబాటులో లేని శానిటరీ ఎస్సై
- 37 చెత్త ట్రాలీ ఆటోలలో తిరిగేవి 27_ మరమ్మ తులకు గుర్రై మూలన పడినవి 10

కొత్తగూడెం కార్పొరేషన్, పాల్వంచ మున్సిపల్ డివిజన్ కార్యాలయంలో ..

# అసలేం జరుగుతుంది?

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 5, (ప్రజా జ్యోతి)** కొత్తగూడెం కార్పొరేషన్ పాల్వంచ డివిజన్ కార్యాలయంలో అసలేం జరుగుతుంది? పాల్వంచ కార్పొరేషన్ డివిజన్ కార్యాలయంలో చెత్త ట్రాక్టర్ల నుండి డీజీలను గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో అపహరించుకుపోయినట్లు సమాచారం, మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న వెలుగు కార్యాలయ స్థల ప్రాంగణంలో చెత్త ట్రాక్టర్లను ప్రతిరోజు సాయంత్రం పార్కింగ్ చేస్తారు, అయితే కొన్ని చెత్త ట్రాక్టర్ల నుండి సోమవారం రాత్రి డీజిల్ ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించకపోయినట్లు ట్రాక్టర్లు నడిపే డ్రైవర్లు గుర్తించారు, ఈ విషయాన్ని సంబంధిత సిబ్బంది పాల్వంచ కమీషనర్ దృష్టికి కూడా తీసుకువెళ్లారు, అయినప్పటికీ డీజిల్ మాయమైన విషయాన్ని సంబంధిత అధికారులు స్థానిక పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేయకపోవడం విచారకరం, ఇదిలా ఉండగా 2008వ సంవత్సరంలో పాల్వంచకు 8 ట్రాక్టర్లు కొనుగోలు చేయగా ఆనాటి నుండి నేటి వరకు కాలం చెల్లిన ట్రాక్టర్ల ద్వారానే చెత్తను డంపింగ్ చేసేందుకు వినియోగిస్తున్నారు, ఈ చెత్త ట్రాక్టర్ల కు ఒక్కొక్క ట్రాక్టర్కు వారానికి

మిగతా 2 లో...

## చర్లలో కలెక్టర్ అంకిత్ పర్యటన



- అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు - జిల్లా కలెక్టర్ అంకిత్
- ఇందిరమ్మ ఇళ్లు, ధాన్యం కేంద్రాల తనిఖీ నాణ్యతే ముఖ్యమన్న కలెక్టర్
- వైద్య సేవలపై కలెక్టర్ ఫోకస్ సదుపాయాలపై సమీక్ష

**చర్ల, మే 5 (ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం చర్ల మండలంలో విస్తృత పర్యటన నిర్వహించి పలు కీలక అంశాలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించి పరిస్థితులను సమీక్షించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.సత్యనారాయణపురం గ్రామంలోని పెద్దపల్లి–ముమ్మిడివరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఇప్పటివరకు వచ్చిన

మిగతా 2 లో...

## పంటల విభిన్నీకరణతోనే రైతుకు భరోసా

- ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావు



**కొత్తగూడెం, మే 5 (ప్రజాజ్యోతి)** రైతులు కేవలం సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా వాణిజ్య పంటల వైపు అడుగులు వేయాలని ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావు సూచించారు. కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం భువన గార్డెన్స్ లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక – 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఉద్యాన పంటల సాగు పై ప్రత్యేక అవగాహన

మిగతా 2 లో...

# గిరిగిరి దందాకు కళ్లెం పడేనా?

- అమాయకుల అవసరాలే వారికి ప్రయోజనమా?
- పెచ్చు మీరుతున్న గిరిగిరి ఆగడాలు
- అనుమతులు లేకున్నా దర్జాగా నిర్వహణ -అధికారులు దృష్టి సారించాలని వేడుకలు



**ఇల్లందు, మే 5, ప్రజాజ్యోతి:** గిరిగిరి ఫైనాన్స్ దందా జిల్లాతో పాటు ఇల్లందులో పెచ్చుమీరుతుందనేది స్పష్టమవుతుంది. అడిగే వారెవ్వరూ లేరనే ధీమాలో దర్జాగా ఈ గిరిగిరి ఫైనాన్స్ దందాను కొనసాగిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇంతలా గిరిగిరి ఫైనాన్స్ దందా నిర్వహిస్తున్నప్పటికీ సంబందిత అధికారులకు కల్పించడం లేదా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వ్యాపారం చేసే పేద, మధ్యతరగతి వారి అవసరాలనే ఆసరాగా చేసుకోని నడుస్తున్న గిరిగిరి ఫైనాన్స్ దందా ఇల్లందులో మూడు పూవులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అంతేకాకుండా అవసరాలను బట్టి రూ.10వేలు తీసుకుంటే 50, 100 రోజులలో

మిగతా 2 లో...

## గిరిగిరి దందాకు కళ్లెం పడేనా?

(మొదటి పేజీ తరువాయి...)

చెల్లించే అవకాశం కల్పించారు. 50 రోజులలో చెల్లిస్తే రూ.10లకు రూ.1000, 100రోజుల్లో చెల్లిస్తే రూ.1500లను ముందుగానే కట్ చేసుకోని ఇస్తున్నట్లు సమాచారం. ఇబ్బందులు ఉండో... వ్యాపారం నడవకనో.. ఒక్క రోజు చెల్లించాల్సిన డబ్బులు ఆపితే సదరు గిరిగిరి ఫైనాన్స్ మాఫియా కన్నెర్ర చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇల్లందులో సాధారణంగా రూ. లక్షల గిరిగిరి ఫైనాన్స్ నడిపిస్తుంటే ఓ వ్యక్తి మాత్రం ఏకంగా రూ. కోట్లలో దందా నిర్వహిస్తున్నట్లు సమాచారం. సదరు వ్యక్తి కనీసం రూ.లక్షకు తక్కువగా గిరిగిరి ఫైనాన్స్ ఇచ్చిన దాఖలాలు లేవనే చెప్పొచ్చు. దర్జాగా సాయంత్రం వేళలో వాహనంపై తిరుగుతూ గిరిగిరి ఫైనాన్స్ డబ్బులు వసూలు చేస్తున్నట్టు తెలుస్తుంది. ఇక మరి కొంతమంది మాత్రం రోజు వారు డబ్బులు ఇబ్బందుల వల్ల చెల్లించిన పక్షంలో తనకు అధికారులతో దగ్గర సంబంధాలు ఉన్నాయని బెదిరింపులకు సైతం పాల్పడుతున్నట్లు సమాచారం. ఫైనాన్స్ తీసుకోవడంతో బయటికి తెలిస్తే పరువు పోతుందని ఇబ్బందులు పడుతూ.. బ్రతిమిలాడుతూ చెల్లిస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా మరికొంతమంది ఇతర రాష్ట్రాల నుండి వచ్చి ఇక్కడే స్థిరపడి మరి రూ. కోట్లల్లో గిరిగిరి ఫైనాన్స్ దందా నిర్వహించడం విశేషం. వీరు మాత్రం రోజు వారిగా కాకుండా వారం, 15 రోజులకు ఒకసారి గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్లి డబ్బులు వసూలు చేస్తున్నట్టు తెలుస్తుంది. ప్రధానంగా ఆంధ్ర గిరిగిరి మాఫియా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులకు రైతులకు పెట్టుబడులు సైతం పెడుతున్నారు. వ్యవసాయానికి ఏమైనా మందులు, విత్తనాలు కావాలంటే సదురు షాపు దగ్గరికి వెళ్తే ఇస్తారని చెబుతూ ఇష్టానుసారంగా తప్పుడు లెక్కలు వేసి రైతులను నిలువునా దోచుకుంటున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. రైతులు కష్టపడి పండించిన పంట చేతికి రాగానే పెట్టుబడి పెట్టిన ఫైనాన్స్ మాఫియా పంట అమ్మి దొంగ లెక్కలతో ముందుగా వారి పెట్టుబడి డబ్బులు తీసుకోవడం జరుగుతుందనే విమర్శలు ఉన్నాయి. ఎంతో కష్టపడి పండించిన రైతుకు కనీసం రోజువారి కూలీ సైతం మిగలడం లేదని అవేదన చెందుతున్నారు. ఇలా ఆమాయక ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని వారిని జలగల్లా పట్టి పీడిస్తున్న వారిపై సంబందిత అధికారులకు ఎందుకు అంత ప్రేమో అర్థం కాని పరిస్థితి. అసలు గిరిగిరి ఫైనాన్స్ దందాకు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత జిల్లా, స్థానిక అధికారులు చొరవ చూపి ప్రజలను దోచుకుంటున్న గిరిగిరి ఫైనాన్స్ దందా ఆగడాలకు కళ్లెం వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

## పంటల విభిన్నీకరణతోనే రైతుకు భరోసా

(మొదటి పేజీ తరువాయి...)

కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల విభిన్నీకరణ చేపట్టడం ద్వారా రైతులు స్థిరమైన ఆదాయం పొందవచ్చన్నారు. ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటల సాగును విస్తరించుకోవాలని పిలుపునిచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ ఆటోమేషన్, సిరికల్చర్, ఆయిల్ పామ్ స్టాళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే, ఆధునిక పద్ధతులపై ఆసక్తిగా వివరాలు తెలుసుకున్నారు. నీటి సంరక్షణ పద్ధతులు పాటించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గి లాభాలు పెరుగుతాయని తెలిపారు. వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన పెంచుకోవాలని రైతులకు హితవు పలికారు. నిపుణులు సూచించిన సాగు మెళకువలను పాటించి ఆర్థికంగా ఎదగాలని కోరిన ఆయన, ఆయిల్ పామ్ విస్తీర్ణం పెంపుదల ప్రయోజనాలను అధికారులు గ్రామ స్థాయిలో వివరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి జె. కిషోర్, ఉద్యాన అధికారి డి. దేవప్రసాద్, హెచ్.ఈ.ఓ వసంత, టిఏసిఏస్ అధ్యక్షులు మండే హనుమంతరావు, ఏ.ఓలు, ఏ.ఈ.ఓలు, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులు శ్రద్ధతో నేర్చుకొని విజయం సాధించాలి

(మొదటి పేజీ తరువాయి...)

పీవో రాల్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థుల మేధాశక్తి , ప్రతిభను వెలికితీయడానికి సమ్మర్ శిక్షణా క్యాంపులలో నిష్ణాతులైన శిక్షకులచే వివిధ కోర్సులలో శిక్షణ అందిస్తున్నందున విద్యార్థులు తప్పనిసరిగా శ్రద్ధతో నేర్చుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. అనంతరం కంప్యూటర్ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు కంప్యూటర్ రెజంతో పాటు వర్డ్స్ , అభ్యాసాలను కూడా అర్థమయ్యే రీతిలో ప్రాక్టికల్ గా విద్యార్థుల చేత చేయించాలని అన్నారు. ఆర్ట్స్, క్రాఫ్ట్ డాన్స్ సంబంధించిన మెలకువలు పిల్లలు క్రమశిక్షణతో నేర్చుకోవడంతో వారి యొక్క మెరుగుదలను పరిశీలించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, క్యాంప్ ఇంచార్జ్ నాగరాజు, పిడి వసంత్, మహాలక్ష్మి పిఈటి, ఆర్ పి లు నటరాజ్, విజయలక్ష్మి, నాగలక్ష్మి, సుజాత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# కొత్తగూడెం కార్పొరేషన్ పాల్వంచ మున్సిపల్ డివిజన్ కార్యాలయంలో అసలేం జరుగుతుంది?

(మొదటి పేజీ తరువాయి...)

ఒకసారి 40 లీటర్ల డీజిల్ వినియోగిస్తుంటారు, 8 ట్రాక్టర్లకు కలిపి మొత్తం వారానికి 280 లీటర్ల డీజిల్ను వినియోగిస్తుంటారు, వెలుగు కార్యాలయంలో పార్కింగ్ చేస్తున్న చెత్త ట్రాక్టర్ల నుండి డీజిల్ చోరీకి గురవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నట్లుగా తెలుస్తుంది, గతంలో ఈ చెత్త ట్రాక్టర్ల నుండి బ్యాటరీలు కూడా మాయమైన సంఘటనలు కూడా ఉన్నాయి, నాడు బ్యాటరీలు చోరీ జరగగా ,నేడు డీజిల్ చోరీకి గురవుతుంది, అసలు ఈ ట్రాక్టర్ల నుండి డీజిల్ను అపహరించకపోయే దొంగ ఎవరు? కార్యాలయంలోని విధులు నిర్వహిస్తున్న సిబ్బందా_లేక బయట వ్యక్తుల అనేది తెలియాల్సి ఉంది, ట్రాక్టర్లు పార్కింగ్ చేస్తున్న ఏరియాలో వాచ్మెన్ ఉన్న లేనట్టేనా? వాహనాల పార్కింగ్ స్థలంలో గతంలో సీసీ కెమెరాలు ఉండేవి, ప్రస్తుతం ఆ సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా లేదా? సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ అవి పని చేయడం లేదని కొంతమంది కార్యాలయ సిబ్బంది సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడంలేద నే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి, ట్రాక్టర్ నుండి చెత్త సేకరణ



చేసిన తర్వాత పాల్వంచ నుండి డంపింగ్ యార్డ్ వద్దకు వెళ్లాలంటే సుమారు 9 నుండి 10 కిలోమీటర్ల వరకు వెళ్లాల్సి వస్తుంది, కాగా చెత్త సేకరణకు పాల్వంచ లోని అన్ని డివిజన్లో తిరగాలంటే ప్రతి రోజు ఎన్ని లీటర్ల డీజిల్ వినియోగించాలి, వారానికి ఒకసారి ఒక ట్రాక్టర్ కు కొట్టించే 40 లీటర్ల డీజిల్ సరిపోతుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా ఉంది, అదేవిధంగా పాల్వంచ డివిజన్లో చెత్త ట్రాలీ ఆటోలు చెత్త సేకరణ కోసం 37 వాహనాలు ఉండగా అందులో 27 చెత్త ట్రాలీ ఆటోలు మాత్రమే డివిజన్లో తిరుగుతూ చెత్తను డంపింగ్ యార్డ్ కు తీసుకెళ్తున్నారు, మిగిలిన ట్రాలీ ఆటోలు మరమ్మతులకు గురై మూలన పడినట్లు సమాచారం, మరమ్మతులకు గురైన ఆటోలకు రిపేరు చేయించాలంటే వాటికి సంబంధించిన మెకానిక్ అందుబాటులో లేరని తెలుస్తుంది, ఇప్పటికైనా మరమ్మతులకు గురైన చెత్త ట్రాలీ ఆటోలను మరమ్మతులు చేయించి చెత్త సేకరణ చేయాలని ప్రజలు వాపోతున్నారు,

**››› పాల్వంచ కార్యాలయంలో నెల రోజులుగా కనబడని శానిటరీ ఎస్సై...**

కొత్తగూడెం కార్పొరేషన్ పాల్వంచ డివిజన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న శానిటరీ ఎస్సై నెల రోజులుగా విధుల్లోకి రావడం లేదని సమాచారం, గతంలో విధులు నిర్వహించిన శానిటరీ ఎస్సై లక్ష్మీనారాయణ పదవీ విరమణ అనంతరం నూతనంగా పాల్వంచ శానిటరి ఎస్సైగా రవి ప్రసాద్ నియామకమయ్యారు, అయితే ప్రస్తుత శానిటరీ ఎస్సై నెల రోజుల నుండి ఎందుకు విధుల్లోకి రావడం లేదు? ఏమైనా పర్సనల్గా లీవ్ పెట్టారా? లేక పాల్వంచ కార్యాలయంలో విధులు నిర్వహించడానికి అసహనంగా ఉన్నారా? ఒకవేళ లీవ్ పెట్టినట్లయితే ఇన్చార్జిగా ఎవరు బాధ్యతలు నిర్వహిస్తున్నారు? ఏదేమైనాప్పటికీ శానిటరీ ఎస్సై ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ఇబ్బంది పడుతున్నట్లు సమాచారం, ఇప్పటికైనా పాల్వంచ మున్సిపల్ కమిషనర్ డీజిల్ చోరీ ఘటనపై_ మరమ్మతులకు గురైన చెత్త ట్రాలీ ఆటోల విషయంపై_ కాలం చెల్లిన చెత్త ట్రాక్టర్ల స్థానములో కొత్త ట్రాక్టర్ల కోసం చొరవ తీసుకొని సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది, పాల్వంచ మున్సిపల్ కార్యాలయం గా ఉన్నప్పుడే కొంత మేర సమస్యలు పరిష్కారం అయ్యాయని, కార్పొరేషన్ అయిన తర్వాత ఇంకా సమస్యలు జటిలమవుతున్నాఏ తప్ప కార్పొరేషన్ పాలన ముందుకు సాగడం లేదని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లుగా ఉంటుందని ప్రజలు చర్చించుకోవడం వినిపిస్తుంది,

# చర్లలో కలెక్టర్ అంకిత్ పర్యటన










(మొదటి పేజీ తరువాయి...)

ధాన్యం పరిమాణం, కొనుగోలు పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. టార్పాలిన్లు, హమాలీలు, తాగునీరు వంటి మౌలిక వసతులను తనిఖీ చేసి, రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ధాన్యం లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని, తగినన్ని లారీలను ఏర్పాటు చేయాలని, అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని రక్షించే చర్యలు తీసుకోవాలని, ట్యాబ్ ఎంట్రీలను ఆలస్యం లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు.గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్ పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించారు. పునాది నుంచి స్లాబ్ వరకు ఇంజనీరింగ్ ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని, నాణ్యమైన సిమెంట్, ఇసుక, ఇనుము వినియోగించాలని సూచించారు. గ్రామంలో మంజూరైన 27 ఇళ్లలో 25 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని, మిగిలిన ఇళ్లకు వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు.చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, మేటర్నిటీ వార్డు, డయాలసిస్ కేంద్రం, మందుల నిల్వ గది, వంటగది, ఓపీ విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని తక్షణ పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని, రోగులకు శుభ్రతతో కూడిన పోషకాహారం అందించాలని సూచించారు.108 అంబులెన్స్ సిబ్బందితో మాట్లాడి అత్యవసర సేవల్లో వేగంగా స్పందించాలని సూచించారు. ఆసుపత్రిలో తాగునీటి కొరతను గుర్తించి నిరంతర నీటి సరఫరా ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో ఈదయ్య, గృహ నిర్మాణ శాఖ ఏఈ ముకేశ్, ఏఓ లావణ్య, మిషన్ భగీరథ ఏఈలు అరుణ్, రాము, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సాయి వర్ధన్, డాక్టర్లు రాంప్రసాద్, రవికుమార్, తిరుపతిరావు, జాన్, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం





- **ఒకే వేదికపై కలిసిన చిన్ననాటి మిత్రులు**

**ఇల్లందు, మే 5, ప్రజాజ్యోతి:** మండలంలోని చెన్నంగుల గడ్డ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో 2003–04వ సంవత్సరంలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు మంగళవారం అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించారు. పాఠశాలలో గడిపిన అప్పటి జ్ఞాపకాలను ఒకరినొకరు గుర్తు చేసుకోని సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా సింగరేణి డైరెక్టర్ మోకాళ్ళ తిరుమలరావు మాట్లాడుతూ ఒకే పాఠశాలలో చదువుకున్న విద్యార్థులందరూ మరల ఒకే వేదికపై కలవడం సంతోషకరమన్నారు. విద్యార్థులు విద్యను కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. విద్యార్థులు వారి జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దానిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని కోరారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో నిలిచి కన్న తల్లిదండ్రులు, పుట్టిన ఊరు, విద్య నేర్పిన గురువులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో గురువులు నేర్పిన పాఠాలను అర్థం చేసుకొవాలని కోరారు. అనంతరం పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి నామా నాయక్, హెచ్ యం ముత్తయ్య, ఉపాధ్యాయులు బీముడు, అంజయ్య, పురుషోత్తం, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు బి బాల, ఎల్ హరిలాల్, డి



దేవేందర్, బి రమేష్, బి సురేష్, బి రవీందర్, అర్జున్, రవీందర్, వెంకటేశ్వర్లు, రాజేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## చెరువు మట్టి తోలకాలకు అనుమతులు

- **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలనుసారంగా**
- **చెరువు మట్టి తొలకాలకు దరఖాస్తులు చేసుకోండి**
- **నీటిపారుదల శాఖ డిఈఈ, బి. రమేష్ బాబు.**



**అశ్వాపురం, మే 5,ప్రజాజ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండల కేంద్రంలోని సర్పంచులు, కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో నీటిపారుదల శాఖ డిఈఈ రమేష్ బాబు మాట్లాడుతూ.... నీటిపారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశానుసారం, గా చెరువుల్లోని సారవంతమైన మట్టిని రైతులు తమ పొలాలకు వాడుకోవడానికి ఉచితంగా ఇవ్వబడుతుంది. మరియు అదే విధంగా వాణిజ్య అవసరాల నిమిత్తం నిర్దేశిత రుసుము చెల్లించి అనుమతులు పొంది మట్టిని తోలుకోవచ్చు అని నీటిపారుదల శాఖ డీఈఈ బి. రమేష్ బాబు,అశ్వపురం యం.పి.డి.ఒ ఆఫీస్ లో సర్పంచులు మరియు పంచాయతీ సెక్రటరీలతో నిర్వహించిన సమావేశంలో తెలియ చేసారు. ఈ విషయాన్ని గౌరవ సర్పంచులకు మరియూ సెక్రటరీల ద్వారా చెరువు కింద రైతులకు , గ్రామ ప్రజలకు తెలియచేయాలి అని చెప్పారు. అందుకు సంబదించిన అనుమతులను, ఉప కార్యనిర్వహక ఇంజనీరు, నీటిపారుదల శాఖ వారి ద్వార తీసుకోవాలి అని తెలిపారు. ఈ సమావేశములొ అశ్వపురం మండల యం. పి.డి.ఒ, జి. ముత్యాలరావు, యూడీసీ పద్మావతి, ఇరీగేశన్ ఎ.ఇ.ఇ లు బి.సక్రు అశ్వపురం మండల సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు పాల్గోన్నారు.

## బేతంపూడి సొసైటీ చైర్మన్‌గా లక్కినేని



**టేకులపల్లి,మే05,ప్రజాజ్యోతి :** టేకులపల్లి మండల కేంద్రంలోని సహకార పరపతి సంఘం బేతంపూడి చైర్మన్ గా లక్కినేని సురేందర్ రావు మంగళవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టు తీర్పు మేరకు జిల్లా సొసైటీ అనుబంధం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.ఆదినారా యణ చేతుల మీదుగా సొసైటీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం లక్కినేని సురేందర్ రావు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. ఈ సందర్భంగా టేకులపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు బోడ బాలు నాయక్, బానోత్ రామా నాయక్, జాలాది అప్పారావు, చీమల సత్యనారాయణ, గుగులోతు లక్ష్మ, లకావత్ నాకా, పూల్ సింగ్, ఆంగోత్ లక్పతి, గూగులోత్ కృష్ణ, బానోతు లాలు, ఉండేటి బసవయ్య, బానోతు రవి, రవీందర్, టేకులపల్లి మండల బీఆర్ఎస్ కార్యకర్తలు,బేతంపూడి పీఏసీఎస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## చర్ల పీఏసీఎస్ చైర్మన్‌గా పరుచూరి రవి కుమార్



**చర్ల, మే 05(ప్రజా జ్యోతి ):** చర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసిఎస్ ) చైర్మన్‌గా పరుచూరి రవి కుమార్ మంగళవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. గతంలో పీఏసిఎస్ పాలక వర్గం పదవీకాలం ముగిసిన అనంతరం, పాలక వర్గం స్థానంలో కోఆపరేటివ్ శాఖ అధికారులు పర్సన్ ఇన్ ఛార్జ్ (పీ ఐ సి )లుగా నియమితులయ్యారు.అయితే ఈ నియామకాలను సవాల్ చేస్తూ కొంతమంది పీఏసిఎస్ చైర్మన్లు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, న్యాయస్థానం విచారణ జరిపి పర్సన్ ఇన్ ఛార్జ్‌ల నియామకాన్ని రద్దు చేసింది.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకారం పీఏసిఎస్ లకు నూతన పాలక వర్గం నియామకం జరిగే వరకు రోజువారీ నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా పాత పాలక వర్గం తిరిగి బాధ్యతలు చేపట్టాలని అధికారుల ద్వారా సూచించింది.దీంతో చర్ల పీఏసిఎస్ పాత పాలక వర్గం మళ్లీ బాధ్యతలు స్వీకరించి, సంఘ కార్యకలాపాలను కొనసాగించనుంది. ధాన్యం సేకరణ, ఉద్యోగుల జీతాల చెల్లింపు, ఇతర పరిపాలన పనులు నిరాటంకంగా కొనసాగేందుకు ఈ నిర్ణయం ఉపయోగపడనుంది.

## ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే వారి శాతం పెంచాలి

- **ఎంపీడీవో సంకీర్త్**





**పినపాక,మే 05(ప్రజాజ్యోతి)** పినపాక మండలంలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే కార్మికుల సంఖ్యను గణనీయంగా పెంచాలని ఎంపీడీవో సంకీర్త్ సూచించారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ సెక్రటరీలతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల వారీగా పనుల్లో పాల్గొనేవారి హాజరు తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం అమలులో ఎదురవుతున్న సమస్యలు, పనుల ప్రగతి, కార్మికులకు చెల్లింపులు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రతి గ్రామంలో అవసరమైన పనులను గుర్తించి, అర్హులైన కార్మికులను ఎక్కువగా భాగస్వామ్యం చేయాలని ఎంపీడీవో సూచించారు. గ్రామ స్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేస్తే ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు.ఈ సమావేశానికి డీఎల్పీఓ సుధీర్ కుమార్, ప్రత్యేక అధికారి తాతారావు హాజరై పథకం అమలుపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశం ద్వారా ఉపాధి హామీ పనుల మెరుగుదలకు కార్యాచరణ రూపొందించారు. ఈ సమావేశంలో ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఏపీవో వీరభద్ర స్వామి తదితర అధికారులు పాల్గొన్నారు.

## రూ.12 లక్షలు విలువ చేసే ఆసిష్ లిక్విడ్ పట్టివేత

- **కారు స్వాధీనం ఇద్దరు వ్యక్తుల అరెస్టు**



**భద్రాచలం టౌన్, మే 5 ప్రజాజ్యోతి** భద్రాచలంలో మంగళవారం రూ.12.50 లక్షలు విలువ చేసే లిక్విడ్ గంజాయిని పట్టణ పోలీసులు పట్టుకున్నారు. ఆర్టీ చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పందంగా కనిపించిన కారును తనిఖీ చేయగా నిషేదిత ఆసిష్ లిక్విడ్ ఉన్నట్లు గుర్తించి అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాలోని కలిమెల నుంచి నాగర్‌కర్నూలుకు వీరు ఈ లిక్విడ్‌ను తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు భద్రాచలం ఎస్సై శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై శ్యాంప్రసాద్ మాట్లాడుతూ పోలీసులకు ప్రజలు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన తెలియపరచాలని, గంజాయి అక్రమ రవాణా సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

## భద్రాచలంలో ప్రగతిచక్ర అవార్డుల ప్రధానం

**భద్రాచలం టౌన్ , మే 5, ప్రజాజ్యోతి** టీజీఆర్‌టీసీ ఖమ్మం రీజియన్ పరిధిలో ప్రగతి చక్ర అవార్డులను మంగళవారం భద్రాచలం ఆర్టీసీ డిపో ఆవరణలో ప్రధానం చేశారు. ఖమ్మం రీజియన్‌లో 56 మంది డ్రైవర్లు, కండక్టర్లు, అద్దె బస్సు డ్రైవర్లకు ఈ అవార్డులను ఆర్టీసీ ఆర్ఎం సరిరాం చేతుల మీదుగా ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఆర్టీసీ డిపో మేనేజర్లు రామయ్య, లక్ష్మీనారాయణ, శివ ప్రసాద్ పాల్గొన్నారు.



# ఇంటర్,పదోతరగతి ఫెయిల్ విద్యార్థులకు ప్రత్యేక సప్లమెంటరీ క్యాంపులు

- 100% ఉత్తీర్ణత లక్ష్యం
- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 5 (ప్రజా జ్యోతి)** జిల్లాలో ఇంటర్మీడియట్, పదోతరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న సప్లమెంటరీ క్యాంపులు, పాఠశాలల మౌలిక సదుపాయాలు, అదే విధంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యాశాఖ చేపడుతున్న పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు, ఇంటర్మీడియట్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలాల వారీగా ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థుల వివరాలను సేకరించి, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. భద్రాచలం, పాల్వంచ, చంద్రుగొండలో నిర్వహిస్తున్న సప్లమెంటరీ క్యాంపుల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని సమీక్షించి, ప్రతి విద్యార్థి ఈ క్యాంపులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మే 13 నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. ఈ తరగతుల ద్వారా విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రతి విద్యార్థి హాజరు మరియు అభ్యాస పురోగతిపై అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా పదోతరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం కూడా సమ్మర్ క్యాంపులు నిర్వహించాలని, మండలాలు ,పాఠశాలల వారీగా ఫెయిల్ విద్యార్థుల వివరాలతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ క్యాంపుల ద్వారా విద్యార్థుల లోపాలను గుర్తించి, లక్ష్యబద్ధంగా బోధన చేపట్టి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని పాఠశాలల్లో వివిధ దశల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సమగ్రంగా సమీక్ష నిర్వహించిన కలెక్టర్, అన్ని పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలల పునః ప్రారంభానికి ముందే పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుదీకరణ వంటి మౌలిక వసతులు 100 శాతం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 12 నుండి విద్యాశాఖ ద్వారా చేపట్టబడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి విజయవంతం చేయాలని అధికారులకు నిర్దేశించారు, ఈ సమావేశంలో అధికారులు తమ మండలాల్లో చేపడుతున్న చర్యలపై వివరాలు తెలియజేయగా, కలెక్టర్ తగిన సూచనలు చేశారు. జిల్లాలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచడం దిశగా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## కొర్రాజుల స్వామి జాతరను ఆనందంగా జరుపుకోవాలి

- భద్రాచలం ఐటీడీఏ పీవో బి. రాహుల్



**భద్రాచలం టౌన్, మే 5 ప్రజాజ్యోతి** రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే బాల కోర్రాజుల స్వామి నాయకపోడు తెగ ఇలవేల్పుల జాతరను చిన్న పెద్ద తేడా లేకుండా కుటుంబ సభ్యులు అందరూ కలిసి ఘనంగా జరుపుకుంటారని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. మంగళవారం తన ఛాంబర్ లో నాయకపోడు బాల కోర్రాజుల స్వామి వారి ఉత్సవ కమిటీ సభ్యుల సమక్షంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.ఆయన మాట్లాడుతూ నాయక పోడు తెగ వంశస్థులు వారి ఇలవేల్పులైన బాల కుర్రాజుల స్వామి కటాక్షం వలన వారి కుటుంబాలు అందరూ క్షేమంగా ఉండటానికి పాడిపంటలు సమృద్ధిగా పండడానికి ప్రత్యేకంగా ఆదివాసి నాయకపోడు ఆరాధ్య దైవమైన బాల కుర్రాజుల స్వామిని ఈనెల 7 నుంచి 15వ తేదీ వరకు వారం రోజులపాటు పూజలు చేసి 15వ తారీకు చివరి రోజు పెద్ద ఎత్తున అగ్నిగుండం ప్రవేశంతో సంబరాలు ముగిస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకపోడు ఉత్సవ కమిటీ సభ్యులు తెల్లం రమణయ్య, పుల్లయ్య, మారయ్య, పూజారి కొండయ్య, లక్క రామకృష్ణ, పాశం భరత్, జమ్మల శ్రీను, ముర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిపీఎల్ సీజన్–6కు రంగం సిద్ధం



**చర్ల ,మే 05(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని చిన్న మిడిసిలేరు గ్రామంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబడుతున్న క్రికెట్ టోర్నమెంట్ 'చిన్న మిడిసిలేరు ప్రీమియర్ లీగ్ సీజన్–6'కు సంబంధించిన కరపత్రికను మంగళవారం ఘనంగా ఆవిష్కరించారు. గ్రామ ఉద్యోగస్తులు పొడియం నాగేశ్వరరావు (టీచర్, ఎస్ ఏ ), మిడియం రామకృష్ణ (టీచర్) చేతుల మీదుగా కాగిత, డిజిటల్ రూపాల్లో కరపత్రిక విడుదలైంది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో చాలా కాలంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నప్పటికీ, నాణ్యమైన క్రీడాకారులు వెలుగులోకి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ 6వ సీజన్‌లో అయినా యువత అధిక సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు.రామకృష్ణ మాట్లాడుతూ, మే 8వ తేదీ నుంచి సిపీఎల్ –6 ప్రారంభమవుతుందని తెలిపారు. చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం ప్రాంతాల గ్రామస్థాయి జట్లు పెద్ద సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎల్ చైర్మన్ కాంతారావు, వైస్ చైర్మన్ రాంబాబు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, కార్యదర్శి ఆది, కోశాధికారి దుర్గారావు, సహాయ కోశాధికారి ప్రేమ్, అలాగే కమిటీ సభ్యులు మనోజ్, నాగరాజు, అన్వేష్, మహేష్, గోపి, సాగర్, రాజు, సోమరాజు, చింటూ, ధోని, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాచారం గ్రామంలో మైనర్ యువతి అదృశ్యం

- కేసు నమోదు



**దమ్మపేట, మే 05 (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం నాచారం గ్రామంలో మైనర్ యువతి అదృశ్యమైన ఘటనపై దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఫిర్యాదుదారు పెంబుల రమాదేవి, ఆమె కుమార్తె పెంబుల దుర్గ భవాని 17 సంవత్సరాలు, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని. మే మూడవ తేది అర్ధరాత్రి ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. ఈ మేరకు అందిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేయబడింది. యువతి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. యువతి గురించి ఎలాంటి సమాచారం ఉన్నవారు దమ్మపేట పోలీస్ స్టేషన్‌ను లేదా సమీప పోలీస్ అధికారులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## పీఏసీఎస్ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన అబ్బినేని శ్రీనివాసరావు



**భద్రాచలం టౌన్ , మే 5 ప్రజాజ్యోతి** భద్రాచలం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులుగా అబ్బినేని శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ సూచనతో బాధ్యతలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అబ్బినేని శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే వ్యవసాయ సీజన్‌లో తమ సహకార సంఘం ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. ముఖ్యంగా రైతులకు ఎరువుల కొరత లేకుండా చూసేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని ఆయన పేర్కొన్నారు. సొసైటీ వైస్ ప్రెసిడెంట్ కొమ్మనాపల్లి సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ కొమ్మనాపల్లి ఆదినారాయణ, చాట్ల శ్రీనివాసరావు, కొండవీటి సరోజినీ పాల్గొన్నారు.

## అంజన్నకు అభిషేకం....రామయ్యకు కల్యాణం

- భద్రాద్రి రామయ్యకు రూ.1.70 లక్షలు విలువైన వెండి పళ్లెం అందజేత



**భద్రాచలం టౌన్, మే 5, ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ ఆవరణలో ఉన్న శ్రీ దాసాంజనేయస్వామి వారికి మంగళవారం సందర్భంగా తమలపాకులతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే నిత్య కల్యా ణ మండపంలో స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, కంకణదారణ జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు. అదేవిధంగా స్వామి వారికి భద్రాచలంకు చెందిన మద్దాల భావాన్‌సాయి మెహర్ రూ.170 లక్షలు విలువ చేసే 655 గ్రాముల విలువైన వెండి పళ్లెంను విరాళంగా అందజేశారు.

## మండలానికి గర్వకారణంగా నిలిచిన మేక మన్విత

- డీఈవో చేతుల మీదుగా సన్మానం



**దమ్మపేట, మే 05 (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండల పరిధిలోని నాగుపల్లి జెడ్పీ హెచ్ యస్ పాఠశాలకు చెందిన విద్యార్థిని మేక మన్విత పదోతరగతి పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచింది. మొత్తం 600 మార్కులకు గాను 571 మార్కులు సాధించి మండలంలోనే అత్యుత్తమ ఫలితాన్ని నమోదు చేసింది. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆమె ను జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) ఘనంగా సన్మానించారు. విద్యార్థిని కృషిని ప్రశంసిస్తూ భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి (ఎం.ఈ.ఓ) జగపతి, నాగుపల్లి జెడ్పీహెచ్ యస్ ప్రధానోపాధ్యాయురాలు కందిమళ్ళ సరళతో పాటు ఇతర ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

## చెరువుల పూడిక మట్టి ఉచితం

- రైతులకు ఇరిగేషన్ శాఖ పిలుపు

**చర్ల, మే 05(ప్రజా జ్యోతి ):** చెరువులను పరిరక్షించి వాటి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు నీటిపారుదల శాఖ చర్యలు చేపట్టింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు సత్యనారాయణపురం సబ్–డివిజన్–3 ఇరిగేషన్ శాఖ అధికారులు చర్ల మండలంలోని చెరువులలోని సారవంతమైన పూడిక మట్టిని రైతులు తమ పొలాలకు ఉచితంగా తరలించుకోవచ్చని తెలిపారు.ఈ నేపథ్యంలో ఆసక్తి గల రైతులు తమ పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ తో ఇరిగేషన్ శాఖ సబ్–డివిజన్–3 కార్యాలయం, సత్యనారాయణపురంలో దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలని అధికారులు సూచించారు.వ్యవసాయ అవసరాల కోసం వినియోగించే పూడిక మట్టిని మాత్రమే ఉచితంగా అందిస్తామని, ఇతర వాణిజ్య అవసరాలకు ఉపయోగించాలనుకునే వారు తగిన రుసుమును డీడీ రూపంలో చెల్లించిన తర్వాతే అనుమతి ఇస్తామని స్పష్టం చేశారు.అలాగే గ్రామ సర్పంచ్ లు "మన చెరువు–మన బాధ్యత"గా భావించి రైతులను ప్రోత్సహించి ఎక్కువ మందికి భాగస్వామ్యం కల్పించాలని కోరారు. ఈ చర్యల ద్వారా చెరువుల సామర్థ్యం పెరగడంతో పాటు భూగర్భ జలాల స్థాయి మెరుగుపడి చెరువుల సంరక్షణకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు.

# ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలి - కూనంనేని




**పాల్వంచ, మే 05, ప్రజాజ్యోతి:** ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు పార్టీ శ్రేణులు నిరంతరం సన్నద్ధంగా ఉండాలని, పెరుగుతున్న రాజకీయ సవాళ్లను ఎదుర్కోవడంలో కమ్యూనిస్టుల బాధ్యత మరింత పెరిగిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం పాల్వంచలోని శ్రీ లక్ష్మి బ్యాంకెట్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ప్రజాస్వామ్యవాదులకు హెచ్చరికగా భావించాలని అన్నారు. దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై కమ్యూనిస్టు కార్యకర్తలు లోతైన అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు.మతోన్మాద శక్తుల విస్తరణను అడ్డుకోవడం ప్రస్తుతం ప్రధాన కర్తవ్యమని, లౌకికవాద పరిరక్షణకు ప్రతి కార్యకర్త కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాలకు అనుగుణంగా పార్టీ కేడర్ అప్రమత్తంగా ఉండి ప్రజల పక్షాన పోరాటాలు ఉధృతం చేయాలని సూచించారు.గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారమే భవిష్యత్ కార్యాచరణకు ఎజెండాగా ఉండాలని స్పష్టం చేశారు. నిరంతర పోరాటాల ద్వారానే సామాన్యుల హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని, ఐక్య పోరాటాల ద్వారానే ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురాగలమని పేర్కొన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలే దేశానికి దిక్సూచిగా నిలుస్తాయని ఆయన అన్నారు.అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా రాజకీయ నివేదికను ప్రవేశపెట్టారు. నరాటి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు సరిరెడ్డి పుల్లారెడ్డి, కె. సారయ్య, సలిగంటి శ్రీను, మున్నా లక్ష్మీకుమారి, అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, కమటం వెంకటేశ్వర్లు, ఆర్టీసీ భాస్కర్, భూక్యా దాసురు, ఉప్పుశెట్టి రాహుల్, మువ్వ వెంకటేశ్వర్లు, ఎస్కే ఫహీం, శంకర్, బంధం నాగయ్య పాల్గొన్నారు.

## కొండరెడ్ల గిరిజన కుటుంబాల పై సర్వే

- మౌలికవసతుల కల్పన, స్థితిగతులపై వివరాల సేకరణ
- జనరల్ డేవిడ్ రాజ్,ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి





**అశ్వారావుపేట, మే 05, ప్రజాజ్యోతి :** దట్టమైన అటవీ ప్రాంతాల్లో బాహ్య ప్రపంచానికి దూరంగా జీవిస్తున్న కొండరెడ్ల గిరిజన కుటుంబాల స్థితిగతులు, వారికి అందుతున్న మౌలిక వసతులపై సమగ్ర సర్వే చేపట్టినట్లు ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ తెలిపారు. ఈ సర్వే కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ ఆదేశాల మేరకు, అలాగే ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సూచనలతో నిర్వహించబడుతోందని పేర్కొన్నారు. మంగళవారం అశ్వారావుపేట మండలంలోని రెడ్డిగూడెం, తిరుమలకుంట, సుద్దగోతుల గూడెం, బండారుగుంపు, నడిమిరెడ్డిగూడెం ప్రాంతాల్లోని గిరిజన గ్రామాలలో సందర్శించిన అధికారులు, జిపిఓల సహకారంతో ఇంటింటికీ వెళ్లి కుటుంబాల పూర్తి వివరాలను సేకరించారు. కుటుంబ సభ్యుల సంఖ్య, వారి వ్యక్తిగత వివరాలు, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతాలు, జీవన బీమా, ఎన్ఆర్ఈజీఎస్ కార్డులు వంటి ప్రభుత్వ పథకాల లబ్ధి వివరాలు నమోదు చేశారు. అదేవిధంగా, గిరిజన కుటుంబాలకు స్వంత గృహాలు ఉన్నాయా లేదా, వారికి అవసరమైన మౌలిక వసతులు ఏవో గుర్తించి, వాటిని ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో నివసిస్తున్న కొండరెడ్ల కుటుంబాల జీవన ప్రమాణాలను సమగ్రంగా అంచనా వేసి, తగిన చర్యలు తీసుకునేందుకు ఈ సర్వే దోహదపడుతుందని అధికారులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవీటీజీ అధికారి గన్యా నాయక్, ఎంపీడీవో అప్పారావు, గ్రామ స్థాయి అధికారులు (జిపిఓలు) మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తి చెరువులో మృతి



**సుజాతనగర్, మే 05 (ప్రజాజ్యోతి):** మండలంలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన బాదావత్ శ్రీను (45) చెరువులో మునిగి మృతి చెందిన ఘటన స్థానికం గా విషాదాన్ని మిగిల్చింది.పోలీసుల వివరాల ప్రకారం, బాదావత్ శ్రీను మే 4వ తేదీ ఉదయం 8 గంటల సమయంలో తన ఇంటి నుంచి బయలుదేరి గ్రామం వెనుక ఉన్న నిమ్మలకుంట చెరువుకు చేపలు పట్టడానికి వెళ్లాడు. అయితే సాయం త్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందా రు. అనంతరం చెరువు కట్టపై అతని బట్టలు, చెప్పులు కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న సుజాతనగర్ ఎస్ఐ రమాదేవి, సిబ్బందితో కలిసి రాత్రి గాలింపు చర్యలు చేపట్టారు. మరుసటి రోజు మే 5వ తేదీ తెల్లవారుజామున సుమారు 6 గంటల సమయంలో శ్రీను మృతదేహం చెరువులో తేలింది.చేపలు పట్టే సమయంలో ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతని భార్య బాదావత్ శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## వడదెబ్బ తగిలి వ్యవసాయ కూలి మృతి




**టేకులపల్లి,మే05, ప్రజాజ్యోతి :** వడదెబ్బ తగిలి వ్యవసాయ కూలి మృతి చెందిన విషాద ఘటన టేకులపల్లి మండలం వెంకట్యా తండ గ్రామంలో మంగళవారం చోటుచేసుకున్నది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం స్టేషన్ బేతంపూడి గ్రామానికి చెందిన తేజవత్ రాంజీ( టిల్లా )రోజువారీ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సొంతం ఉరిలో పనులు ఇబ్బందిగా ఉండటంవల్ల,టేకులపల్లి మండలం వెంకట్యా తండా గ్రామంలో పిల్లను ఇచ్చి అత్త వారి ఇంటి పని నిమిత్తం వచ్చి మూడు రోజులు గడుస్తున్నా క్రమంలో మంగళవారం వడదెబ్బ తగిలి నడుస్తూ ఒక్కసారిగా కుప్పకూలడం జరిగింది. స్థానికులు గమనించి చెట్టు నీడ కింద తీసుకువెళ్లి చూసేసరికి రాంజి మృతి చెందడం స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య నీలా, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నట్లు తెలిపారు. ఇంకా పూర్తి వివరాలు తెలవాల్సిన ఉంది.

## లక్ష్యంతో చదివితేనే ఉత్తమ ఫలితాలు

- ఎంపీడీవో జమలారెడ్డి



**బూర్గంపహాడ్,మే5 (ప్రజా జ్యోతి ):** చదువు ఏదైనా లక్ష్యంతో చదివితేనే సత్ఫలితాలు వస్తాయని, దీనికి క్రమశిక్షణ తోడైతే సంస్కారం అబ్బుతుంది అని బూర్గంపహాడ్ ఎంపీడీవో జమలారెడ్డి అన్నారు.మంగళవారం మండలంలోని పినపాక పట్టి నగర్ పంచాయతీ కార్యాలయంలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచిన సపావట్ కనిష్కను మరియు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన ధారావత్ తేజేశ్వరి, జస్వంత్, ఐశ్వర్య, ఝాన్సీ అనే విద్యార్థులను స్థానిక సర్పంచ్ బానోత్ పద్మ, పాలకవర్గ సభ్యులతో కలిసి సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే మంచి స్థాయికి చేరుకుంటారని, తల్లిదండ్రులు పిల్లల నుండి ఆశించేది డబ్బు ఇంకా వేరేదో కాదని అందరిలో మంచి పేరు తెచ్చుకొని వారికి మంచి పేరు తేవాలని, మంచి ప్రయోజకులు ఐతే ఆ తల్లిదండ్రులుగా పడే సంతోషం మాటల్లో చెప్పలేనిదని అన్నారు. అందుకే ప్రతి విద్యార్థి తమ కోసం తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పడే కష్టాన్ని దృష్టిలో పెట్టుకొని చదవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోటమళ్ళ వెంకటరమణ,వార్డు సభ్యులు శ్రీను,నల్లగట్ల గీత,భూక్య పద్మ,నిఖిల్, ఫీల్డ్ అసిస్టెంట్ దారావత్ శ్రీను, సెక్రటరీ విజయ్,బానోత్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల శ్రేయస్సుకై కృషి చేస్తాం :కొత్వాల

- పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ గా కొత్వాల పదవి బాధ్యతల స్వీకారం





**కొత్తగూడెం కలెక్టరేట్, మే 5,(ప్రజా జ్యోతి )** రైతుల శ్రేయస్సుకై సొసైటీ పాలకవర్గం కృషి చేస్తుందని పాల్వంచ సొసైటీ అధ్యక్షులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.పాల్వంచ సహకార సంఘం అధ్యక్షులుగా కొత్వాల తోపాటు పాలకవర్గం సభ్యులు తిరిగి పదవి భాద్యతలు స్వీకరించారు. మంగళవారం సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సొసైటీ పర్సన్ ఇంచార్జి ఎం జయశ్రీ నుండి కొత్వాల తోపాటు వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, సభ్యులు బుడగం రామ్మోహన్ రావు, కనగాల నారాయణరావు, చౌగాని పాపారావు, జరబన సీతారాంబాబు, సామా జనార్ధనరెడ్డి, భూక్యా కిషన్, యర్రంశెట్టి మధుసూదన్ రావు లు పదవి భాద్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ రైతుల బాగోగుల కోసం తిరిగి పాలకవర్గాలను నియమించిన తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నిత్యం రైతులకు అందుబాటులో వుంటూ, వారి శ్రేయస్సుకై కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం ద్వారా చేపట్టే సంక్షేమ కార్యక్రమాలను రైతులకు అందేలా కృషి చేస్తామని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ జి లక్ష్మీనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

- డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ రవి





**దమ్మపేట, మే 05 (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలంలో ఉపాధి హామీ పథకం అమలును వేగవంతం చేసి, గ్రామీణాభివృద్ధికి మరింత బలోపేతం చేయాలని, రాష్ట్రగ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఆదేశాల మేరకు మంగళవారం సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ రవి, ఎంపీడీఓ రవీంద్రారెడ్డి, ఏపీవో సుధాకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ రవి మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో పనులను తక్షణమే ప్రారంభించి, కనీసం 150 మంది కూలీలు పనిచేసేలా సర్పంచ్‌లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పనిస్థలంలో కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఉపాధి పనులు విస్తృతంగా అమలైతే గ్రామ పంచాయతీలకు అధిక నిధులు లభిస్తాయని, గ్రామాభివృద్ధికి ఉపాధి నిధులు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.అలాగే కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది సర్పంచ్‌లతో సమన్వయం చేసుకొని కూలీలను సమీకరించే (మొబిలైజేషన్) చర్యలు చేపట్టాలని, ఇకెవైసీ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలని సూచించారు.ఎంపీడీఓ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమం భాగంగా నర్సరీలలో మొక్కలను సమృద్ధిగా పెంచాలని, గ్రామాల్లో మొక్కలు నాటే స్థలాలను గుర్తించాలని సూచించారు. హార్టికల్చర్ రంగంలో చిన్న, సన్నకారు రైతులను గుర్తించి ఉపాధి హామీ పథకం ద్వారా వారికి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## టీవీకే చీఫ్ జోసెఫ్ విజయ్ చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం

- దశాబ్దాల చరిత్ర ను తిరగరాసిన జోసఫ్ విజయ్
- అంబేద్కర్ యువజన సంఘం నాయకులు



**అశ్వాపురం, మే 5, ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రం అంబేద్కర్ సెంటర్ కూడలిలో మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత, డా. బాబా సాహెబ్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం వెలువడిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో తమిళనాడు టీ వి కే అధినేత జోసెఫ్ విజయ్ దళపతి ముఖ్యమంత్రి పీఠం దక్కించుకున్న సందర్భంగా మండలంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర అంబేద్కర్ సంఘం నాయుకులు విజయ్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు..అనంతరం స్వీట్స్ పంచిపెట్టారు..ఈ కార్యక్రమం లో పలువురు మాట్లాడుతూ....కులాలు, మతాలు, ప్రాంతాలు మరీ ముఖ్యంగా భాషా బేధాలా ఆధిపత్యంతో దీర్ఘకాలంగా అతలాకుతలం అవుతున్న తమిళనాడు రాజకీయాలపై జెన్ జెడ్ తరం తమ ముద్ర వేసింది...కొన్ని దశాబ్దాల తర్వాత సినీ నటుడు విజయ్ తమిళనాడు రాజకీయాల్లోని ద్రావిడ ఆధిపత్యాన్ని చేదించారన్నారు.... ఒక ఆటో డ్రైవర్, కార్ డ్రైవర్ కుమారుడుకి అసెంబ్లీ టిక్కెట్లు ఇచ్చి గొప్ప నిర్ణయం తీసుకోని వాళ్ళను అసెంబ్లీ కి ఘనత ఒక్క విజయ్ కి మాత్రమే దక్కుతుందని అని అన్నారు....ఈ కార్యక్రమంలో...అంబేద్కర్ యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఈనెల 12న టీజేఎస్ ప్లీనరీకి భారీగా హాజరుకావాలి : నాయకుల పిలుపు



**భద్రాచలం, మే 5 (ప్రజా జ్యోతి):** ఈనెల 12న హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ జలవిహార్ సమీపంలోని గద్దర్ ప్రాంగణంలో నిర్వహించనున్న తెలంగాణ జన సమితి (టీజేఎస్) నాలుగో ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. మంగళవారం భద్రాచలం పట్టణంలో తొలి దశ ఉద్యమ నాయకుడు తిప్పన సిద్ధులు స్వగృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయనతో పాటు టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు బరగడ దేవదానం మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఎన్నో త్యాగాలతో సాధించుకున్నప్పటికీ, ఉద్యమ ఆశయాలు పూర్తిస్థాయిలో నెరవేరలేదని వారు అభిప్రాయపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలో ప్రజల ఆశలు తీరలేదని, కాంట్రాక్టులు కమిషన్ల రాజకీయాలు ప్రాధాన్యం పొందాయని ఆరోపించారు.ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను పక్కనబెట్టి నిరంకుశ ధోరణిలో వ్యవహరించిందని విమర్శించారు. ఉద్యమ లక్ష్యాల సాధన కోసం ప్రజాస్వామ్య పరిరక్షణ అత్యవసరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపినట్టు వివరించారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలు ప్రజావ్యతిరేకంగా ఉన్నాయని, దేశంలో విద్వేష రాజకీయాలను ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. తెలంగాణలో కూడా అలాంటి రాజకీయాలను విస్తరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఇచ్చిన “చదువు–బోధించు–సమీకరించు–పోరాడు” అనే సందేశాన్ని ఆదర్శంగా తీసుకుని, ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితో ప్రజలను సంఘటితం చేస్తామని తెలిపారు. తెలంగాణ నిర్మాణం కోసం పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో జరుగనున్న ఈ ప్లీనరీ సమావేశానికి ప్రతి కార్యకర్త హాజరై విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పగడాల కరుణాకర్ రెడ్డి, నాయకులు ప్రభాకర్ రెడ్డి, న్యాయవాది ఆంజనేయులు, రేపాక రామారావు తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- తహసీల్దార్ కార్యాలయం ముందు న్యూడెమోక్రసీ ధర్నా





**పాల్వంచ, మే 05, ప్రజాజ్యోతి:** అకాల వర్షాల కారణంగా నష్టపోయిన మామిడి, వరి, మొక్కజొన్న రైతులను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో పాల్వంచ తహసీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ, రైతులు రాత్రింబవళ్లు శ్రమించి పండించిన పంటలు అకాల వర్షాలు, గాలిదుమారాల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. మామిడి తోటల్లో కాయలు రాలిపోవడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారని, వరి, మొక్కజొన్న పంటలను రోడ్లపై ఆరబోసిన సమయంలో వర్షానికి తడిసి పనికిరాకుండా పోయాయని పేర్కొన్నారు.తక్షణమే వ్యవసాయ అధికారుల ద్వారా సర్వే నిర్వహించి నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.తహసీల్దార్ ప్రసాద్ వినతిపత్రాన్ని స్వీకరించి, సంబంధిత అధికారులతో వెంటనే సర్వే నిర్వహించి రైతులను ఆదుకునే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పట్టణ కార్యదర్శి మంకెన వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి కల్తి రాములమ్మ, నాయకులు కే. మల్లేష్, రాజేష్, కందాల బుచ్చిరెడ్డి, తూము రాజయ్య, బత్తుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ పంటలపై రైతులు దృష్టి సారించాలి



**ఇల్లందు, మే 5, ప్రజాజ్యోతి:** రైతులు ఆయిల్ పామ్ పంటలపై దృష్టిసారించాలని జిల్లా వ్యవసాయ అధికారి వి. బాబురావు సూచించారు. ప్రజా పాలన ప్రగతి నివేదిక 99 రోజుల ప్రత్యేక కార్యచరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని సుదిమళ్ల రైతు వేదికలో ఉద్యానవన పంటల సాగు, ఆయిల్ పామ్ పంట విస్తీర్ణం పెంపుదల, ప్రత్యామ్నాయ పంటల సాగు పై నియోజకవర్గస్థాయి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధికంగా వంట నూనె దిగుబడి నిచ్చే పంటల్లో ఆయిల్ ఫామ్ చాలా ప్రధానమైందని, ఒక ఎకరం వరి సాగుతూ అవసరమయ్యే నీటితో మూడు ఎకరాల ఆయిల్ ఫామ్ పంట చేపట్టవచ్చని పేర్కొన్నారు. ఇల్లందు మండలంలో ప్రధానంగా పండించే మొక్కజొన్న పంటకు బదులుగా ప్రతి ఒక్క రైతు ఆయిల్ ఫామ్ పంటను సాగు చేయాలని తెలిపారు. ఆయిల్ పామ్ పంటకు ఒక ఎకరాకు 57 మొక్కలు అవసరమవుతాయని, 60 సెంటి మీటర్ల పొడవు, 60 సెంటీమీటర్ల వెడల్పు, 60 సెంటీమీటర్ల లోతు పరిమాణంతో గుంతలు తీసి మొక్కలు నాటుకోవచ్చని సూచించారు. మొక్కల మెయింటినెన్స్, అంతర్ పంటలకు ఎకరానికి రూ. 4200 చొప్పున రైతు ఖాతాలో జమ చేయబడుతుందని పేర్కొన్నారు. ఎకరానికి సరాసరి 8–10 టన్నుల గెలల ఉత్పత్తిని దిగుబడి చేసుకోవచ్చని, ఒక టన్ను సుమారుగా రూ. 23,500 ఉంటుందని, నేరుగా ప్రభుత్వం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, సహాయ వ్యవసాయ సంచాలకుల జీ లాల్ చంద్, ఇల్లందు, టేకులపల్లి మండల వ్యవసాయ అధికారులు పీ సతీష్, ఎన్ అన్నపూర్ణ, ఎంపీడీఓ ధన్ సింగ్, హార్టికల్చర్ అధికారి స్రవంతి, ఆత్మ కమిటీ చైర్మన్ బోడా మంగీలాల్, ఇల్లందు, టేకులపల్లి వ్యవసాయ విస్తరణ అధికారులు, ఆత్మ సిబ్బంది, గోద్రెజ్, ఆయిల్ ఫీడ్ కంపెనీ బాధ్యులు, ఇల్లెందు, టేకులపల్లి మండలాల ఉత్తమ రైతులు, రైతులు పాల్గొన్నారు.